క్లుప్తంగా

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

పాలకొండ: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో సరస్వతీ దేవి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. మండల విద్యాశాఖాధికారి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విగ్రహావిష్కర చేసి వందనం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ జి.రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వినతి



ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కురుపాం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ నాయకులు ఐసీడీఎస్ కార్యాలయం అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని, ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ మండల నాయకులు పాల్గొన్నారు.

విక్రంపురంలో గ్రామసభ



మాట్లాడుతున్న కళింగ మల్లేశ్వరావు

కొమరాడ: మండలంలోని విక్రంపురం గ్రామంలో సర్పంచ్ కళింగి శైలజమ్మ ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించడంతో పాటు గిట్టుబాటు వేతనం అందేలా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భీమయ్య, ఉపాధిహామీ పథక సాంకేతిక సహాయకుడు జగదీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా భూముల రీసర్వే



తహసీల్దార్ అప్పారావు

భామిని: మండలంలో చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూసర్వే శరవేగంగా జరుగుతోందని తహసీల్దార్ నీలాపు అప్పారావు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ.. గురండి, వడ్డంగి, పక్కుడుబద్రి, బత్తిలి, బొమ్మిక రెవెన్యూ గ్రూపుల పరిధిలో డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్(డీఎల్ఆర్) సర్వే పూర్తయిందన్నారు. పెద్దదిమిలి, చిన్నదిమిలి, నులకజోడులో గ్రౌండ్ ట్రూతింగ్(జీటీ) పనులు కొనసాగుతున్నాయన్నారు. దూర ప్రాంతాల్లో ఉంటున్న రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను అందివ్వాలని కోరారు. రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి సవరిస్తామన్నారు. ఆయనతో పాటు మండల సర్వేయర్ తోట రామ్మోహనరావు, ఆర్ఐ ఎస్.రాంబాబు ఉన్నారు.

వాహనాల వేలం రేపు

పాలకొండ రూరల్: సారా, మద్యం కేసుల్లో సీజ్ చేసిన ఎనిమిది ద్విచక్ర వాహనాలను ఈనెల 30న వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ సీఐ ఎంవీ గోపాలకృష్ణ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 10 గంటలకు జరిగే వేలంలో పాల్గొని వాహనాలను సొంతం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు స్థానిక ఎస్ఈబీ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మధ్యాహ్న భోజన వంటలను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

భామిని: విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకోవాలని ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు అన్నారు. బత్తిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో శనివారం ఆయన మాట్లాడారు. పబ్లిక్ పరీక్షలకు ఏ విధంగా ప్రిపేర్ అవ్వాలో మెలకువలు సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులుక నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు



పాలకొండ రూరల్: సూర్యనారాయణస్వామి మూలవిరాట్‌ను తాకిన భానుడి కిరణాలు

సమస్త జీవరాశికి వెలుగును ప్రసాదించే సూర్య భగవానుడి జయంతిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పిడకల పొయ్యిపై పరమాన్నం వండి స్వామికి నైవేధ్యం సమర్పించారు. ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ఆదిత్యున్ని ప్రార్థించారు.

పాలకొండ రూరల్: పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన సూర్యనారాయణస్వామి మూలవిరాట్‌కు భానుడి కిరణాలు తాకాయి. ఈ అపురూప దృశ్యాన్ని చూసి భక్తులు భక్తి పారవశ్యానికి లోనయ్యారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. అర్చకులు వేమకోటి హరీష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.



భామిని: బాలేరులో సూర్యనారాయణ స్వామికి పూజలు

చిదిమిలో ఆధ్యాత్మిక శోభ



గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీసుందర విశ్వేశ్వరస్వామి ఆలయం

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు నేతృత్వంలో పార్వతీ సమేత కాశీసుందర విశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణం సర్వాంగ సుందరంగా చేపట్టారు. సుమారు రూ.1.50 కోట్లతో అత్యాధునిక హంగులతో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈనెల 30 నుంచి మూడు రోజుల పాటు ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది. ఇప్పటికే గ్రామంలో రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం, సాయిబాబా మందిరంతో పాటు పలు దేవతామూర్తుల ఆలయాలు ఉన్నాయి. ఇప్పుడు శివాలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణానికి ఎంపీపీ 30 సెంట్ల స్థలాన్ని వితరణ చేశారు. తన సొంత నిధులతో పాటు గ్రామస్తుల సహకారంతో ఆరు నెలల్లోనే ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇందులో మరకత శివలింగాన్ని ప్రతిష్ఠించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయ ముఖద్వారం

సచివాలయ రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు

గరుగుబిల్లి: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు సూచించారు. ఉల్లిభద్ర గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణ, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలని సూచించారు. జగనన్న చేదోడు పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



సుంకిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: ఉపాధి వేతనదారులు రెండు పూటలా పనుల్లో పాల్గొనాలని ఎంపీడీఓ జి.పైడితల్లి సూచించారు. మండలంలోని తోటపల్లి, ఉల్లిభద్ర, సుంకి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆమె పరిశీలించారు. వేతనదారుల మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..నిర్దేశిత కొలతల మేరకు పనులు పూర్తిచేసినట్లయితే గరిష్ఠంగా రూ.257 వేతనం లభిస్తుందన్నారు. వేతనదారుల హాజరును యాప్‌లో పొందుపర్చాలని, పనులకు హాజరుకాని వారికి మస్టర్లు వేసినా, అవకతవకలకు పాల్పడినా సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట టీఏ కె.నిర్మల, ఉమామహేశ్వరి, ఎఫ్ఏ ఆదినారాయణ తదితరులున్నారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

పాలకొండ: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. శనివారం గ్రీన్ అంబాసిడర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు చెల్లించాల్సిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐలు వర్తింప చేయాలని, గ్రామ పంచాయతీలే వేతనాల చెల్లించేలా ఇచ్చిన జీఓను రద్దు చేయాలని, ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు కాద రాము, ఎస్.గురువులు, సీహెచ్ ఈశ్వరరావు, శంకరరావు, బి.రవి, వైకుంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సాయం

- వ్యవసాయ మోటార్లకు పగటిపూట 9 గంటలు విద్యుత్ సరఫరా
- అన్నదాతకు తీరిన సాగునీటి కష్టాలు



విద్యుత్ మోటారుతో పొలానికి నీరు పెడుతున్న దృశ్యం

నియోజకవర్గంలో వ్యవసాయ పంపుసెట్ల వివరాలు

మండలం	బోర్లు
జియ్యమ్మవలస	1346
కురుపాం	565
గుమ్మలక్ష్మీపురం	15
కొమరాడ	2138
గరుగుబిల్లి	846

జియ్యమ్మవలస: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతుల సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. వ్యవసాయ రంగంలో నూతన పద్ధతులు తీసుకొస్తూ అన్నదాతల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి నిధులు మంజూరు, ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు, పంట పండించక ముందే ఆయా పంటలకు మద్దతు ధర, నిష్పత్తుల సమయంలో బీమా సౌకర్యం, ఇన్‌పుట్ సబ్సిడీ, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసింది. పొలం బడి కార్యక్రమం ద్వారా వ్యవసాయాధికారులు పంట సాగుకు అవసరమైన మెలకువలు, సస్య రక్షణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వీటితో పాటు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ బోర్లకు పగటిపూట తొమ్మిది గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది.

పగటిపూట విద్యుత్ సరఫరా..

గత ప్రభుత్వంలో అనేక విధాలుగా ఇబ్బందులకు గురైన రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక నిర్ణయాలతో ముందుకు పోతున్నారు. ఇందులో భాగంగానే రైతులకు విద్యుత్ కష్టాలను తప్పించడానికి ఇచ్చిన మాట ప్రకారం పగటిపూట 9 గంటట పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వ్యవసాయ పంపుసెట్ల కింద పంటలు సాగు చేస్తున్న రైతులకు సాగునీటి కష్టాలు తీరాయి.

రైతు పక్షపాతి సీఎం జగన్



రాష్ట్రంలోని రైతులకు ఇచ్చిన మాట ప్రకారం పగటిపూట తొమ్మిదిగంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతిగా నిలిచారు. నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేయడంతో రైతులకు సాగునీటి కష్టాలు తీరాయి.

– మర్రాపు ధనుంజయరావు, వెంకటరాజపురం

గత ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు



గత టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా సక్రమంగా అందేదికాదు. ముఖ్యంగా రాత్రిపూట విద్యుత్ సరఫరా చేయడంతో రైతులు ప్రమాదాలకు గురై ప్రాణాలు విడిచేవారు. కాని నేడు పగటిపూట విద్యుత్ అందించడం వలన రైతులు సంతోషంగా పొలం పనులు చేసుకుంటున్నారు.

– బడే అప్పలనాయుడు, రైతు, వెంకటరాజపురం

గతానికి భిన్నంగా..



రైతులకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. గతంలో షిఫ్ట పద్ధతిలో రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా చేసేవాళ్లం. ఇప్పుడలా అలా కాకుండా పగటి సమయంలో మాత్రమే విద్యుత్ ఇవ్వడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బడే శ్రీనివాసనాయుడు,ఏఈ,జియ్యమ్మవలస

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



నవగాంలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: మండలంలో ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజనా లబ్ధిదారులు ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండలంలోని నవగాం, అవలంగి తదితర గ్రామాల్లో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, నిర్మాణ సామగ్రిని సద్వినియోగం చేసుకుని నిర్మాణాలు వేగవంతం చేయాలని కోరారు. అనంతరం ఆయా గ్రామ సచివాలయాలను సందర్శించి రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని సూచించారు. ఉపాధి పనులు చేపడుతున్న ప్రదేశానికి వెళ్లి వేతనదారులతో మాట్లాడారు. రెండు పూటలా పనులు చేయాలని, ఇచ్చిన కొలతల మేరకు పనులు చేపడితే సగటున రూ.250 వరకు వేతనం లభిస్తుందన్నారు.

అటవీ సంరక్షణపై గిరిజనులకు అవగాహన



పుట్టజమ్ము గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆర్.రాజాబాబు

గుమ్మలక్ష్మీపురం: వేసవి కాలం వచ్చేస్తోందని, ఈ కాలంలో అటవీ ప్రాంతంలో ఎండిన ఆలకులకు చిన్న నిప్పు అంటుకుంటే అడవి మొత్తం మంటలు వ్యాపించే అవకాశం ఉందని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఆర్.రాజాబాబు అన్నారు. పోడు భూములు సాగు చేసే గిరిజనులు పంట వ్యర్థాలకు నిప్పు పెట్టేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు శనివారం కొత్తగూడ, పుట్టజమ్ము గ్రామాల్లోని గిరిజనులకు అవగాహన కల్పించారు. పోడు భూమి సాగు పేరుతో అటవీ ప్రాంతంలో మంటలు వేయడం వల్ల పక్కనే ఉన్న మరికొన్ని చెట్లు కాలిపోయే ప్రమాదం ఉందన్నారు. అటవీ ప్రాంతం నాశనం అవుతుండడం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఫలితంగా వర్షాలు సకాలంలో కురవని పరిస్థితులు ఏర్పాడుతున్నాయన్నారు. అటవీ ప్రాంతంలోని పిచ్చి మొక్కలు, ఎండిన ఆకులు, కత్తిరించిన కొమ్మలను ఎక్కడపడితే అక్కడ మంట పెట్టకుండా, ఖాళీగా ఉన్న ప్రదేశానికి తీసుకువెళ్లి మంట పెట్టాలని, ఆ మంట పూర్తిగా ఆగినంత వరకు కనిపెట్టుకుని ఉండాలన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ మొగనాళి గెడ్డ పరిసర ప్రాంతం, హనుమగిరి కొండ పరిసర ప్రాంతం, కురుపాం సమీపంలోని మాలతమ్మ గూడి పరిసర ప్రాంతంలో ఎకోటూరిజం ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఆయన వెంట సెక్షన్ ఆఫీసర్ ఎస్.భాస్కరరావు, బీట్ ఆఫీసర్లు పి.తిరుమల, రామారావు, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

ఇద్దరికి గాయాలు



ఘటన స్థలంలో క్షతగాత్రులు

పార్వతీపురం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని జోగింపేట వద్ద శనివారం జరిగింది. పార్వతీపురం ఔట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రాయగడకు చెందిన గుడుపూరు అప్పలనాయుడు లోచర్ల గ్రామం నుంచి సీతానగరం మీదుగా పార్వతీపురం పట్టణానికి స్కూటీపై వస్తున్నాడు. అదే సమయంలో పార్వతీపురం నుంచి సీతానగరం వైపు మోటార్ బైక్‌పై వస్తున్న బి.స్వామినాయుడు జోగింపేట వద్ద ఒకరినొకరు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అప్పలనాయుడు ఎడమకాలు, తల వెనక భాగం, మోకాలిపై గాయాలు కాగా, స్వామినాయుడుకు కూడా శరీరంలోని పలుచోట్ల గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

తెలుకుల సంక్షేమానికి కృషి



ఎమ్మెల్యే జోగారావుకు వినతిపత్రం అందజేస్తున్న తెలుకుల సంఘ సభ్యులు

పార్వతీపురంటౌన్: తెలుకుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా రాష్ట్ర అఖిల గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘ సభ్యులు పార్వతీపురం మన్యం జిల్లాకు శనివారం విచ్చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తెలుకుల అభివృద్ధికి చొరవ చూపాలని ఎమ్మెల్యేకు సభ్యులు వినతిపత్రం అందజేశారు. అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, తెలుకుల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నరవ అనంతరం, స్టేట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీప్రియా, దేవ తెలుకుల రాష్ట్ర సమైక్య అధ్యక్షుడు అద్దా వీర వెంకటరాజు, గాండ్ల, దేవ తెలుకుల, తెలుకుల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్లు ఉయ్యూరు నాని, చెవిటి వెంకటరమణారావు, మన్యం జిల్లా అధ్యక్షుడు రావుపల్లి రామయ్య మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: జగనన్న తెలుకుల నేస్తం పేరిట ఓ పథకం పెట్టి, తెలుకుల సంఘ సంక్షేమానికి తోడ్పడాలని రాష్ట్ర గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా స్థానిక పట్టణానికి వచ్చిన ఆయన తెలుకుల ఐక్యత, సంక్షేమం, అభివృద్ధి అంశాలపై కాసేపు మాట్లాడారు.

త్వరితగతిన గృహ నిర్మాణాలు



లబ్ధిదారులతో సమావేశమైన ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి

సీతానగరం: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్ రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని బళ్లకృష్ణాపురం గ్రామంలో రామమందిరం వద్ద లబ్ధిదారులతో సమావేశమైన ఆయన అర్హులైన ప్రతీ పేదవాని సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, నిర్మాణానికి అవసరమైన సామగ్రి, ఆర్థికసాయం చేస్తోందన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ సదుపాయాలు వినియోగించుకుని, త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు, హౌసింగ్ ఏఈ జానకీరాం, ఏపీఓ నాగలక్ష్మి పాల్గొన్నారు.